ప్రజాశక్తి
శనివారం 29 నవంబర్ 2025 5
శ్రీ సత్యసాయి

ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

కొత్త విత్తనచట్టంతో రైతుకు నష్టం

రైతాంగ సమస్యలపై పోరాటాలకు రైతులను సన్నద్ధం చేయాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

జిల్లా మహాసభలో రైతాంగ సమస్యలపై చర్చ

సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్రప్రభుత్వం కొత్తగా తీసుకురావాలని యోచిస్తున్న విత్తన చట్టం 2025 రైతులకు తీవ్ర నష్టదాయకమైందని ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గార్లదిన్నె మండలంలోని కల్లూరు గ్రామంలో అనంతపురం జిల్లా 13వ మహాసభ శుక్రవారం జరిగింది. రైతు సంఘం నాయకులు బడా సుబ్బిరెడ్డి, ఇస్మాయిల్ ప్రాంగణంలో జరిగిన ఈ మహాసభలో ముఖ్య అతిథిగా కె.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. మహాసభ రెండవ రోజు ప్రారంభానికి ముందు ఎఐకెఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. మృతి చెందిన రైతు సంఘం నాయకులు బడా సుబ్బిరెడ్డి, ఇస్మాయిల్ చిత్రపటాలకు పూలమాలలు వేసినివాళులు అర్పించారు. అనంతరం రైతు సంఘం నాయకులు నాగరాజు, శీరిష, మధు అధ్యక్షవర్గంలో ఈ మహాసభ ఆరంభమైంది. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విత్తనం చట్టం 2025ను తీసుకొచ్చేందుకు సిద్ధపడిందని తెలిపారు. దీని వలన కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూరనుందేతప్ప రైతులకు ఏ మాత్రం ప్రయోజనం లేదని అన్నారు. అదే విధంగా విద్యుత్ సంస్కరణల బిల్లును తెస్తోందన్నారు. ఇలా రైతులకు అన్ని విధాలుగా నష్టం చేకూర్చే చట్టాలనే కేంద్రం తీసుకొస్తోందని వివరించారు. ఇప్పటికే అమెరికా ఒత్తిళ్లకు లొంగి పంట ఉత్పత్తులపైన్న దిగుమతి సుంకాలను తగ్గించిందన్నారు. పత్తి, మొక్కజొన్న, పప్పుశనగ కాకుండా పాల ఉత్పత్తులను సైతం దిగుమతి చేసుకోవడానికి ఇతర దేశాలకు అనుమతులను కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందన్నారు. లీటరు రూ.26లకు అమెరికా నుంచి పాలు దిగుమతి చేసుకుంటే ఇక్కడి రైతులకు ఏ మేరకు గిట్టుబాటు ధర లభిస్తుందో వేరే చెప్పనవసరం లేదని పేర్కొన్నారు. ఇక పరిశ్రమల పేరుతో ఇటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున భూముల సేకరణను చేపడుతున్నాయన్నారు. భూములు కోల్పోయి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. రాయలసీమ జిల్లాల్లో ఎక్కడాలేనన్ని సోలార్ పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నారన్నారు. ఏడాదికి ఎకరానికి రూ.30 వేలు చెల్లించి భూములు తీసుకుని వారు మాత్రం లక్షలాది రూపాయలను సంపాదించుకుంటున్నారన్నారు. బీజు పద్ధతిలో కాకుండా భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధరల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదని అన్నారు. ఏ ఒక్క పంటకు సరైన గిట్టుబాటు ధర ఉండటం లేదని చెప్పారు. గిట్టుబాటు ధర కోసం పోరాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రైతాంగ సమస్యలపై రైతులందరినీ సమీకరించి పోరాటాలను సన్నద్ధం చేయాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. రైతులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల గురించి కూడా రైతుల్లో ప్రచారం చేయాలని సూచించారు. అందరి మద్దతు కూడగట్టి పార్టీలకు అతీతంగా రైతులు సమస్యలపై కదిలే విధంగా కృషిచేయాలని పేర్కొన్నారు. ఈ మాదేళ్ల కాలంలో అనంతపురం జిల్లాలో రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల నివేదికను రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ప్రతినిధుల ముందు ఉంచారు. పంటబీమా కోసం.గిట్టుబాటు ధరలు కల్పించే అంశంపై పోరాడటం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఒ.నల్లప్ప ఎపి పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బాలరంగయ్య రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

ఎంపీకి యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తెట్టిపి జయచంద్రారెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) శ్రీసత్యసాయి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హిందూపురం ఎంపీ బికె.పార్థ సారథిని అనంతపురం నగరంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు ఖచ్చితంగా టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) క్వాలిఫై కావాలనే సుప్రీంకోర్టు తీర్పును సవరించి, విద్యా హక్కు చట్టంలోని క్లాజులను మార్పు చేయాలన్నారు. దేశంలో పని చేస్తున్న అందరూ ఉపాధ్యాయులు టెట్ పరీక్ష రాసి క్వాలిఫై అవ్వాలని రెండు సంవత్సరాల లోపు అలా క్వాలిఫై కాకపోతే ఆ ఉపాధ్యాయులను సర్వీస్ నుంచి తొలగించాలని విద్యా హక్కు చట్టంలోని క్లాజ్ 23(1) ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఈ తీర్పు వలన దేశం మొత్తం మీద లక్షలాది మంది ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి తలెత్తిందని అన్నారు. రాష్ట్రంలో 1 .70 లక్షల మంది టీచర్లు ఉంటే లక్ష మంది సీనియర్ టీచర్లు టెట్ క్వాలిఫై అవ్వాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. లేదంటే ఉద్యోగాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. అయితే టెట్ పరీక్ష రాయడం అనేది 2011 నుండి విద్యా హక్కు చట్టం వలన అమలు అవుతోందన్నారు. అప్పటి నుంచి టీచర్ వృత్తికి రావాల్సిన వారందరూ టెట్ రాసి క్వాలిఫై అవుతున్నారని తెలిపారు. అయితే 2011 ముందు నియమితులైన 20, 30 సంవత్సరాలు నుంచి పని చేస్తున్న ఉపాధ్యాయులు అనుభవంతో ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్‌లు చేసి ఎప్పటికప్పుడు ఓరియంటేషన్ ట్రైనింగ్‌లను తీసుకుంటూ అప్డేట్ అవుతూ ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. వారు కూడా పరీక్ష క్వాలిఫై కావటం అనేది సీనియర్ టీచర్లుగా ఉన్న ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురిచేసే చర్య అని అన్నారు. ఇప్పటికే యుటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం విద్యా శాఖ మంత్రిని కలిసిందని సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ ప్రభుత్వం తరపున వేయాలని కోరామని అన్నారు. డివిజన్ కేంద్రాలలో నిరసన ప్రదర్శనలు చేయడం, జిల్లా స్థాయిలో రాష్ట్ర స్థాయిలో ధర్నాలు ర్యాలీలు చేయనున్నట్టు తెలిపారు. స్పందించిన ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి టెట్ మినహాయింపు జరిగేలా తమ వంతుకృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శులు ఈ.నారాయణ స్వామి, రామకృష్ణ నాయక్, సురేష్ దేవరాజు, నాయకులు రవీంద్ర నాథ్, నబీ, రామాంజనేయులు, రామకృష్ణ, వినయ్ కుమార్, కృష్ణ తేజ, నాగి రెడ్డి, ఆంజనేయులు, రామకృష్ణ, సాయినాథ్ రెడ్డి, రాజశేఖర్, కుళ్ళయప్ప, బాలగుండ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు. జూనియర్ కళాశాలల్లో మెగా పిటిఎం 3.0 : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ మేరకు జిల్లాలో డిసెంబర్ 5 నుండి మెగా తల్లిదండ్రుల , ఉపాధ్యాయుల సమావేశం (మెగా పి టిఎం 3.0)ను ప్రతి ప్రభుత్వ పాఠశాల , జూనియర్ కళాశాలల్లో సమగ్ర ప్రణాళికతో నిర్వహించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలోని చాంబర్లో కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ అధికారులు, విద్యాశాఖ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, అభ్యాస ఫలితాలు, హాజరు, ప్రవర్తన, అభ్యాస అంతరాలు వంటి అంశాలపై తల్లిదండ్రులకు స్పష్టమైన అవగాహన కల్పించే విధంగా ఈ కార్యక్రమాన్ని అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. డిసెంబర్ 5న అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పిటిఎం 3.0 నిర్వహణ తప్పనిసరి అని అన్నారు. విద్యార్థుల అభ్యాస ఫలితాలపై చర్చించేందుకు తల్లిదండ్రులను పెద్దఎత్తున ఆహ్వానించాలని, సమాజ భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తూ హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేయాలని చెప్పారు.ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి పురోగతి, హాజరు, ప్రవర్తన, అభ్యాస లోపాలు తల్లిదండ్రులతో వ్యక్తిగతంగా చర్చించాలన్నారు. అసెస్‌మెంట్ బుక్స్ , హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు పూర్తిగా అప్డేట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్టప్ప, సమగ్ర శిక్ష ఏపీసీ దేవరాజు, ఆర్డీవోలు సువర్ణ, మహేష్, విపిఎస్. శర్మ ఆనందకుమార్, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లపై అవగాహన నిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా చేపట్టిన 'మీ డబ్బు మీ హక్కు' కార్యక్రమం ద్వారా గత పదేళ్లుగా లావాదేవీలు లేని బ్యాంకు ఖాతాల నుంచి ప్రజలు తమ డబ్బును తిరిగి పొందేలా విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సూచించారు. ఈ మేరకు ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టరు ను క్రవారం స్థానిక కలెక్టరేట్‌లో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,88,083 లావాదేవీలు నిలిచిపోయిన ఖాతాలు ఉన్నాయని, వాటిలో రూ.66.95 కోట్లు అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా ఉన్నాయనితెలిపారు. ఈ నిధులు సంబంధిత బ్యాంకుల హెడ్ ఆఫీసుల నుంచి ఆర్‌బిఐకి బదిలీ అయినట్లు పేర్కొన్నారు. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉన్న వారు ఆధార్, పాన్, పాస్‌పోర్ట్ ఫోటోతో సమీప బ్యాంకు శాఖను సంప్రదించి ఈ-కేవైసీ పూర్తి చేయాలని బ్యాంకు ఖాతాలు పునరుద్ధరించబడిన తర్వాత, ఆర్‌బిఐతో పరస్పర ధృవీకరణ ప్రక్రియ అనంతరం సంబంధిత వ్యక్తుల ఖాతాల్లోకి డబ్బు జమ అవుతుందని చెప్పారు. కార్యక్రమంపై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపట్టాలని కలెక్టర్ బ్యాంకు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం రమణకుమార్, సిపిఒ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ

ధర్మవరం రూరల్: ధర్మవరం మార్కెట్ యార్డు నందు ఉన్న ఈవీఎం గోడౌన్లను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నెల వారి తనిఖీలో భాగంగా. ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్ల భద్రతకు తీసుకుంటున్న జాగ్రత్తలను ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో మహేష్, గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పవర్ లూమ్స్, హ్యాండ్ లూమ్స్ చీరల తయారీ పరిశీలన: ధర్మవరం పట్టణంలోని పలు పవర్లూమ్స్, హ్యాండ్లూమ్స్ తయారీ సెంటర్లను కలెక్టర్ శ్యాం ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని జింకా రామాంజనేయులు యూనిట్, శారద నగర్ లోని గుద్దటి ఈశ్వరయ్య యూనిట్లను సందర్శించి అక్కడ చీరలు నేస్తున్న వారితో మాట్లాడి చీర తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. చీర తయారీలో డిజైనింగ్ రీలింగ్ డయింగ్ క్రిస్టియన్ తదితర వివరాలను యూనిట్ యజమానులు, డిజైనర్ నాగరాజును అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చేనేత కార్మికులు, చేనేత పరిశ్రమ నడుపుతున్న వారు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం టిడిపి నాయకుడు పరిశే సుధాకర్ చేనేత సమస్యలపై వివరాలను తెలుపుతూ వినతి పత్రాన్ని కలెక్టర్ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ సురేష్ బాబు, హ్యాండ్లూమ్ ఏడీ రామకృష్ణ, డిఇ. రమణారెడ్డి, ఏడీవోలు సుబ్బరాయుడు, శీనా నాయక్, డిజైనర్ నాగరాజు పాల్గొన్నారు.

చంద్రబాబుది అప్పుల పాలన : కాంగ్రెస్

ప్రజాశక్తి-హిందూపురం

అప్పులు చేయడంలో సిఎం చంద్రబాబుకు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని ఏఐసిసి సత్య సాయి జిల్లా పరిశీలకులు అజయ్ సింగ్, పిసిసి అబ్జర్వర్ తులసి రెడ్డి విమర్శించారు. శుక్రవారం హిందూపురం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతంపై ఆయా ప్రాంతాలలో సంస్థాగత నిర్మాణంపై చేపట్టే సమీక్ష సమావేశంపై వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నదే అధిష్టానం లక్ష్యమని ఆ దిశగా అడుగులు వేస్తూ ముందుకు వెళ్ళనున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు. ప్రాంతీయ పార్టీలైన వైసిపి, టిడిపిలు దొందు దొందేనని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17 నెలల్లో రెండు లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. అప్పులు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆస్కార్ అవార్డు ఇవ్వచ్చు అన్నారు. ఈ నేపథ్యంలో దేశానికి, రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన ఎంతో అవసరమని చెప్పారు. రాష్ట్రంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నదే అధిష్టానం లక్ష్యమని ఆ దిశగా అడుగులు వేస్తూ ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఐ [illegible] అనంతరం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, పార్టీ బలోపేతం కోసం పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఇనాయతుల్లా, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటా సత్యం, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, పార్టీ జిల్లాకోఆర్డినేటర్లు యం.ఈ కిఫాయతుల్లా తోపాటు ఆయా నియోజక వర్గాల కోఆర్డినేటర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

పాఠశాల అభివృద్ధికి 'హెరిటేజ్' వితరణ

రూ. 23 లక్షలు అందజేసిన నారా బ్రాహ్మణి

ప్రజాశక్తి - లేపాక్షి

మండలం పరిధిలో లోని కుర్లపల్లి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి మంత్రి నారాలోకేష్ భార్య నారా బ్రాహ్మణి వితరణ అందజేశారు. పాఠశాల భవనాల మరమ్మతులకు రూ. 15 లక్షలు అందజేశారు. , స్కూల్ బిల్డింగ్ రిపేర్, పెయింటింగ్, కాంపౌండ్ నిర్మాణానికి 'హెరిటేజ్ డైరీ సంస్థ తరఫున ఈనగదును అందజేశారు. అలాగే నవోదయ పాఠశాలకు రూ. 8 లక్షల విలువ చేసే సోలార్ ప్యానల్‌లను 'హెరిటేజ్ సంస్థ తరఫున ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తమ సంస్థ తరపున చేయూతను అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం లో మండల విద్యాశాఖ అధికారులు నాగరాజు, కుళ్లాయప్ప, ఉపాధ్యాయులు నాగరాజు, నవోదయ ప్రిన్సిపల్ నాగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న నారా బ్రాహ్మణి

'సౌర హిందూపురం' సాధనకు కృషి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో పూర్తిస్థాయిలో సౌర ఫలకలను ఏర్పాటు చేసేందుకు బ్యాంకర్ల సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కోరారు. శుక్రవారం తన ఛాంబర్ లో మున్సిపల్ పరిధిలోని అన్ని శాఖల బ్యాంకుల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ బ్యాంకు మేనేజర్లకు ఆజెండా తెలియజేస్తూ మెప్మా మహిళా సంఘాలకు సంబంధించిన రుణాల పంపిణీ, రికవరీ, ఎల్.హెచ్.పి. సెల్ రుణాలు, పి.యం.స్వనిధి, కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్షించారు. అలాగే పి.యం.సూర్య ఘర్ ఋణాల గురించి బ్యాంకు మేనేజర్లకు వివరించారు. అన్ని శాఖల బ్యాంకు అధికారులు శాసన సభ్యుల ఆదేశాల మేరకు పట్టణ ప్రజలకు విరివిగా రుణాలు అందించి సౌర హిందూపురంగా మార్చాలని కమిషనర్ కోరారు. అలాగే పట్టణ ప్రజలకు పి.యం.సూర్య ఘర్ రుణాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సోలార్ కి సంబంధించి ఎలక్ట్రికల్ బిల్లులో పేర్ల మార్పులు, చేర్పులు ఉన్నా వాటిని కూడా మార్చి సూర్య ఘర్ ఏర్పాటుకు సహకరిస్తామని విద్యుత్ శాఖ ఈఈ.చంద్ర నాయక్ తెలిపారు. ఈ సమావేశంలో మెప్మా విభాగం అధికారులతో పాటు వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

క్రీడలతో మానసిక,శారీరక ఆరోగ్యం : డిఇఒ

క్రీడాపోటీల సందర్భంగా మాట్లాడుతున్న డిఇఒ

ప్రజాశక్తి - కొత్తచెరువు

క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కలిగిస్తాయని డిఇఒ కిష్టప్ప పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం జరిగిన సత్యసాయి జిల్లా వ్యాప్తంగా భవిత కేంద్రాల్లో చదివే వికలాంగ విద్యార్థులకు జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిఇఒ మాట్లాడుతూ భవిత కేంద్రాలలో చదివే విద్యార్థులు ఈ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిసి దేవరాజు, స్టేట్ అబ్జర్వర్ మల్లికార్జున, డిసిపిఒ మహేష్, ఎంఇఒ జయచంద్ర, హెచ్‌ఎం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని 'కూటమి' : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురం రూరల్ మండలం కిరికెర గ్రామపంచాయతీ వీవర్స్ కాలనీలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దీపికా వేణురెడ్డి మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గానికి ఎమ్మెల్యే బాలకృష్ణ చుట్టపు చూపుగా వస్తూ ప్రజల బాగోగులను గాలికి వదిలేశారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చి హిందూపురం ప్రజల బాగోగులను చూడాలని హితవు పలికారు. అనంతరం వార్డులలో కమిటీలను ఏర్పాటు చేసి, రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ రాము, ఎంపీటీసీలు ధనుంజయ రెడ్డి, వైస్ సర్పంచ్ నరేంద్ర, కవిత, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అమానుల్లా, జిల్లా కార్యదర్శి తిప్పేరుద్రయ్య, నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దీపికా వేణురెడ్డి

భావవ్యక్తీకరణ నైపుణ్యం అవసరం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి విద్యార్థి కమ్యూనికేషన్ స్కిల్స్ పై అవగాహన పెంపొందించుకోవాలని పెనుగొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు డాక్టర్ బి.యశోదా రాణి, కళాశాల ఐ క్యూ ఎ సి కోఆర్డినేటర్ డాక్టర్. శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ ఎస్ పి ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపల్ జె వెంకటేశులు అధ్యక్షతన కమ్యూనికేషన్ స్కిల్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలామంది యువకులు డిగ్రీలు సాధించినప్పటికీ, సరైన భావవ్యక్తీకరణ నైపుణ్యాలు లేకపోవడం వల్ల బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించలేకపోతున్నారన్నారు. విద్యార్థి దశలోనే కొంత సమయాన్ని ప్రత్యేకంగా ఇంగ్లీష్ భాష కోసం కేటాయించి, తగిన నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, వారికున్న అనేక సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకులు రంగనాయకులు, ఉపేంద్ర, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీలక్ష్మి

ఉపకారాగారం తనిఖీ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఉపకారాగారాన్ని జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపకారాగారంలో ఉన్న రిమాండ్ ఖైదీలతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిత్యావసరాలు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. ఖైదీల ఆహారం కోసం తయారుచేసిన పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సబ్ జైలు గదులు, శుద్ధ జల ప్లాంటు, పిర్యాదులు పెట్టె తదితర వాటిని ఆయన పరిశీలించారు. అనంతరం న్యాయాధికారి మాట్లాడుతూన్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని రిమాండ్ ఖైదీలకు అవసరమైతే ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగార అధికారి హనుమప్ప, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, రాజు, పారా లీగల్ వాలంటీరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్

రెవెన్యూ డివిజన్‌గా మడకశిర.. కూటమి సంబరాలు

ప్రజాశక్తి-మడకశిరటౌన్

నియోజకవర్గ కేంద్రమైన మడకశిరను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం పట్ల శుక్రవారం మడకశిర పట్టణంతో పాటు అగళి, గుడిబండ, అమరాపురం, రొళ్లలో కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు సంబరాలు చేసుకున్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, ఐటి మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రత్యేక చొరవతో సిఎం చంద్రబాబు మడకశిరను రెవెన్యూ డివిజన్‌గా చేయడం హర్షణీయమన్నారు. మడకశిర పట్టణంలోని అమరాపురం బస్టాండ్‌లో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, నగర పంచాయతీ ఛైర్మన్ నరసింహ రాజు, మండల కన్వీనర్ నాగరాజు ఆధ్వర్యంలో, అగళిలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఎన్.లక్ష్మినారాయణ, జడ్పిటిసి ఉమేష్ ఆధ్వర్యంలో తెలుగుతమ్ముళ్లు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. గుడిబండలో మండల కన్వీనర్ లక్ష్మీ నరసప్ప, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మడకశిరలో సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గుండుమల తిప్పేస్వామి, నాయకులు

అమరాపురంలో బస్టాండ్‌లో సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్, ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. రొళ్లలో వక్కలిగ రాష్ట్ర సాధికార కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ భరత్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో తెలుగుతమ్ముళ్లు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మంత్రులు లోకేష్, అనగాని సత్యప్రసాద్ చిత్రపటాలను ఊరేగించి పాలాభిషేకం చేశారు.

ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై ఏమాత్రం నిర్లక్ష్యం వద్దని, తక్షణమే పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అధికారులకు సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్‌కు అనూహ్య స్పందన లభించింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఒక గ్రీవెన్స్‌లో ఇచ్చిన అర్జీలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఎక్కువగా రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయని తక్షణం శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఆస్తి వివాదాలు, డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, పింఛన్లు, పక్కా గృహాల కోసం అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

ఎరువుల కొరత రానివ్వం : ఎమ్మెల్యే

నియోజకవర్గంలో రైతులకు ఎరువుల కొరత లేకుండా పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. పుట్టపర్తి ప్రాథమిక సహకార సొసైటీ కార్యాలయంలో ఎమ్మెల్యేతో పాటు పల్లె రఘునాథరెడ్డి 140 మంది రైతులకు 280 బస్తాల యూరియా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ ఈ ఏడు వర్షాలు బాగా కురవడంతో అన్ని చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉన్నాయని, రైతులు సకాలంలో పంటలు సాగు చేసి మంచి దిగుబడి సాధించాలని సూచించారు. ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ప్రతి రైతుకు ప్రభుత్వం సహకార సొసైటీల ద్వారా యూరియా అందిస్తుందన్నారు. ఇదే మంచి, రైతు ప్రభుత్వం అని పల్లె తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు వెంకటరాముడు, బ్యాంకు సీఈఓ రవిశంకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చెరువులో నీటిని తొలగించాలని వినతి

కొత్తచెరువు : బుక్కపట్నం చెరువులో పదేళ్లుగా నీరు నిల్వ ఉందని, దీంతో నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని, ఆ నీటిని ఓసారి పూర్తిగా తొలగించాలని కోరుతూ సాలమ్మగారి శివ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. చెరువులో నీటిని తొలగించిన తర్వాత రైతులు మట్టిని ఉచితంగా తోలుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

లబ్ధిదారునికి సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎంపి

సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని తురకలాపట్నం గ్రామానికి చెందిన శ్రీనివాసులు భార్య కె.రత్నమ్మకు ముఖ్య మంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సాయం మంజూరైంది. ఆ చెక్కును శుక్రవారం అనంతపురంలోని తన నివాసంలో ఎంపి బి.కె.పార్థసారధి శ్రీనివాసులుకు అందజేశారు. వారితో పాటు ఆ గ్రామ నాయకులు నాగేంద్ర, రవి, తదితరులు ఉన్నారు.

7న ఎన్ఎంఎంఎస్ పరీక్ష : డిఇఒ

కొత్తచెరువు : 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిసెంబర్ 7వ తేదీ జాతీయ ఉపకార వేతనం పరీక్ష(ఎన్ఎంఎంఎస్) నిర్వహిస్తున్నట్లు డిఇఒ జి.కృష్ణప్ప తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 13 కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. 2,697 మంది విద్యార్థులు హాజరవనున్నారన్నారు. హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో ఉంచామని డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా పరీక్ష కేంద్రాన్ని తెలుసుకోవచ్చు అన్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-నల్లమాడ

స్థానిక ఎస్సీ కాలనీలో ఉన్న 3వ అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఎంపిడిఒ జి.శ్రీనివాసులు, పరిపాలన అధికారి జి.శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు. పిల్లలను సరైన సమయంలో పిలుచుకొచ్చి వారికి ఆహారాన్ని సమయానికి పెట్టాలన్నారు. వారిని ఇంటికి చేర్చే వరకూ సంరక్షణగా చూసుకోవాలని ఆదేశించారు.

డీఎస్పీని కలిసిన టిడిపి నాయకులు

ముదిగుబ్బ : పుట్టపర్తి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా ఇందిర నియమితులయ్యారు. ఆమెను శుక్రవారం టిడిపి నాయకులు బండి మల్లికార్జున, సాయినాథ్ బాబు, రవీంద్ర నాయక్, తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఇందిర సిఐగా విధులు నిర్వర్తించి ఉద్యోగోన్నతిపై పుట్టపర్తి మహిళా డీఎస్పీగా నియమితులు కావడం హర్షణీ అన్నారు.

డీఎస్పీని కలిసిన టిడిపి నాయకులు

పోలీసులకు క్రమశిక్షణ అవసరం : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఆరోగ్యం చక్కగా ఉన్నప్పుడే పోలీస్ శాఖలో సమర్థవంతంగా విధులు నిర్వహించగలుగుతారని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పోలీసు పరేడ్ మైదానంలో ఏఆర్ సాయుధ బలగాలు, స్పెషల్ పార్టీ పోలీసులు, హోంగార్డులతో నిర్వహించిన పరేడ్‌ను శుక్రవారం ఎస్పీ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు ఆరోగ్యం పట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రమశిక్షణతో ఉంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు.

పరేడ్ మైదానంలో మాట్లాడుతున్న ఎస్పీ

విధి నిర్వహణలో పరేడ్‌కి ఎంతో ఆవశ్యకత ఉందన్నారు. పరేడ్ అందరినీ సమైక్యంగా చేస్తూ సమిష్టి విధి నిర్వహణకు తోడ్పడుతుందన్నారు. ఎస్కార్ట్ విధులు నిర్వహించే సిబ్బంది ఎలాంటి పరిస్థితుల్లో ముద్దాయిలతో జతకట్టకూడదన్నారు. కర్తవ్యాలను సమర్థవంతంగా నిర్వహించినప్పుడే సమాజం ప్రశాంతంగా ఉంటుందన్నారు. సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలన్నారు. పరేడ్‌లో ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు రవికుమార్, వలి, మహేష్, ఆర్ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

పంటలు ప్రణాళికాబద్ధంగా సాగు చేయాలి

ప్రజాశక్తి-బత్తలపల్లి

రైతులు వ్యవసాయాన్ని ప్రణాళికాబద్ధంగా సాగు చేయాలని, ముఖ్యంగా ఒకే పంటలు కాకుండా అంతర పంటలు సాగు చేసి అధిక ఆదాయం పొందాలని ఎడిఎ లక్ష్మానాయక్ పేర్కొన్నారు. మండలం లోని గంటాపురంలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి అధ్యక్షతన రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎడిఎ మాట్లాడుతూ రైతులు పంచ సూత్రాలు పాటిస్తూ వ్యవసాయాన్ని జాగ్రత్తగా ప్రణాళికాబద్ధంగా చేయాలన్నారు. వ్యవసాయ పంటలు, ఉద్యానవన పంటలు, కూరగాయలు, మల్బరీ, తదితర పంటలు సాగు చేసుకోవాలన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందులు విచక్షణారహితంగా వాడవద్దని సూచించారు. నీరు చాలా పొదుపుగా వాడాలని, డ్రిప్, స్ప్రింక్లర్లు 90 శాతం సబ్సిడీతో పొందవచ్చన్నారు. ఐదెకరాల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులు వంద శాతం సబ్సిడీతో పొందవచ్చన్నారు. వరికి నీటి ఆవశ్యకత ఎక్కువగా ఉంటుందని కావున రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలన్నారు. డిమాండ్ వ్యాల్యూ ఉన్న పంటలతో పాటు గట్లపై కొబ్బరి, టేకు, తదితర పంటలు వేయాలన్నారు. కూలీలు కొరత ఎక్కువగా ఉండటం వల్ల ఆధునిక వ్యవసాయ పనిముట్లు, పంట కోత మిషన్లు వాడి పెట్టుబడులు తగ్గించాలన్నారు. మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు శనివారం లోగా ఎపి ఎయిమ్స్ యాప్‌లో రైతు కుటుంబాలను వందశాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో ఓబిరెడ్డి, ఏఈఓ శ్రీనివాసులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది ఓబులమ్మ, రైతులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పాత హైస్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం చేనేత కార్మిక సంఘం మండల నాయకులు మాబు అధ్యక్షతన మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సంఘం జిల్లా నాయకులు ఎస్‌హెచ్ బాషా, ఖాదర్‌బాషా, హరి హాజరై మాట్లాడారు. నేతన్న నేస్తం ద్వారా తక్షణం రూ. 25 వేలు ఇవ్వాలని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలని, ఇళ్ల స్థలాలు, ముద్ర రుణాలు ఇవ్వాలని, 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాలు అమలు చేయాలన్నారు. లేనిచో రాబోవు కాలంలో చేనేత కార్మికులను ఏకం చేసి ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం 28 మందితో మండల కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులుగా మాబు, నేసే నాగరాజు, షబ్బీర్‌ఖాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే

చేనేత కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మాబు, నేసే నాగరాజు

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి శ్రీదేవి అధ్యక్షతన మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి సభ నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న, బెస్త కిష్టప్ప, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొండా వెంకటేశులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణం, నాయకులు కిష్టప్ప, సిపిఎం మండల కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, కెవిపిఎస్ నాయకులు గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది

విపత్తులపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి-పరిగి

విపత్తు సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హెచ్ఎం కృపాసత్యరాజ్ సూచించారు. విపత్తు ప్రతిస్పందనల దళం(ఎన్‌డిఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విపత్తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది విపత్తుల రకాలు, అవి సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ శాంతిలాల్, హెడ్ కానిస్టేబుళ్లు రామకృష్ణ, పటేల్, గంగాధర్, వారి బృందం సభ్యులు అరవింద్‌రెడ్డి, ఖాదర్, ఎంఇఒలు, హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణపై సమావేశం

ప్రజాశక్తి-గాండ్లపెంట

ఇంటింటి చెత్త సేకరణపై శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సిఆర్‌పి పారిశుధ్య కార్మికులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిఎల్‌పిఒ వెంకటరత్నం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, సుస్థిరాభివృద్ధి లక్షణాలు, ఇంటింటి చెత్త సేకరణ, తడి, పొడి చెత్త వేరు చేసి చెత్త సంపద కేంద్రానికి తరలింపుపై అవగాహన కల్పించారు. అనంతరం కార్మికులు వీధుల్లో చెత్త సేకరించి దాదాపు 3 ట్రాక్టర్ల చెత్తను చెత్తసంపద కేంద్రానికి తరలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ టి.రామ కృష్ణ, ఈవోఆర్డీ పంచాయతీ కార్యదర్శులు మూర్తి, హరినాథ్, సాధిక్, పారిశుధ్య కార్మికులు అక్కులప్ప, కదిరప్ప, నరసింహులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి-అగళి

మండలంలోని హెచ్‌డి.హళ్లితండాలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఎంటిఎస్ ఉపాధ్యాయుడు శ్రీనివాసులును శుక్రవారం అదే పాఠశాలలో మండల ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పలువురు ఆయన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఓబుళపతి, నరసంబూది హెచ్ఎం ఆజాద్, ఉపాధ్యాయులు షబ్బీర్, ఎంటిఎస్ ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ప్రజాదర్బార్ అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ సూచించారు. పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొత్తం 472 ఫిర్యాదులు అందాయన్నారు. ఒక గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలు మళ్లీ రాకుండా అధికారులు వేగవంతంగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సమస్యలపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని వీటికి తక్షణం శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. అలాగే ఆస్తి వివాదాలు, డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, పింఛన్లు, పక్కా గృహాల కోసం అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్‌ఉన్నీసా, కమిషనర్ కిరణ్‌కుమార్, తహశీల్దార్ మురళీకృష్ణ, కౌన్సిలర్లు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కదిరిటౌన్ : టిడిపి కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. నల్లచెరువు మండలం కె.పూలకుంట గ్రామానికి చెందిన షేక్‌షాకీర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. అతడు టిడిపి సభ్యత్వం కలిగి ఉండటంతో రూ. 5 లక్షల బీమా మంజూరైంది. దీంతో ఎమ్మెల్యే శుక్రవారం షేక్ షాకీర్ భార్య మస్తాన్‌బికు బీమా పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్, నాయకులు గుత్తా ప్రసాద్, సతీష్‌చౌదరి, అబ్దుల్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం

ప్రజాశక్తి-పెనుకొండ

ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకోండని ఆర్డీవో ఆనంద్ కుమార్ సూచించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 2,37,558 ఓటర్లు ఉండగా, పురుషులు 1,18,636, మహిళలు 1,18,918, ఇతరులు 4 ఉన్నారని వివరించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. సమావేశంలో తహశీల్దార్లు ఉదయశంకరరాజు, హసీనా సుల్తానా, టిడిపి పట్టణ అధ్యక్షులు శ్రీరాములు యాదవ్, ఎనుముల రామకృష్ణ, వేదవ్యాస్, నియోజకవర్గంలోని ఎఈఆర్‌ఒలు, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఆనంద్ కుమార్

పారిశుధ్య కార్మికులకు శిక్షణ

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని స్వచ్ఛ భారత్ కార్మికులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శుక్రవారం ఎంపిడిఒ వెంకటలక్ష్మి, డిప్యూటీ ఎంపిడిఒ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులు లేని సమాజాన్ని చూడలేమన్నారు. వారు ఆరోగ్యం దృష్ట్యా పని ప్రదేశాల్లో తప్పనిసరిగా మాస్కులు, చేతి, కాళ్ల గ్లౌజులు ధరించాలన్నారు. చెత్తను తడి, పొడి, ప్లాస్టిక్ వ్యర్థాలుగా మూడు రకాలుగా విభజించి చెత్తసంపద కేంద్రానికి చేర్చి సంపద వృద్ధి చెందేలా కృషి చేయాలన్నారు. ఉద్యోగులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పచ్చదనం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తను ఎలా తీయాలి, తీయకపోతే కలిగే నష్టాలు, కార్మికుల జీతాలు, వారి హక్కులు, తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చంద్రశేఖర్, మండల కన్వీనర్ వెంకటేష్, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లిలో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ చేపట్టిన అధికారులు, కార్మికులు

బుక్కపట్నం : గ్రామాల్లో పరిశుభ్రత, అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సర్పంచి నాగలక్ష్మిరాజు, ఎంపిడిఒ శ్రీనివాసులు తెలిపారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా బుక్కపట్నంలోని వివిధ కాలనీల్లో చెత్తచెదారం తొలగించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్స్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఎంపిడిఒ కేశవరెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజునాయక్, పెనుకొండ పంచాయతీ కార్యదర్శి రెడ్డిప్రకాష్ పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. పారిశుధ్య కార్మికుల విధి విధానాలు, కర్తవ్యాలు, తదితర అంశాలను వివరించారు.

15న డప్పు కళాకారుల మహాసభ

ప్రజాశక్తి-చిలమత్తూరు

పుట్టపర్తిలో డిసెంబర్ 15వ తేదీ నిర్వహిస్తున్న డప్పు కళాకారుల మహాసభను జయప్రదం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఎంవి.రమణ పిలుపునిచ్చారు. మండలంలోని కొర్లకుంట గ్రామంలో శుక్రవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో డప్పు కళాకారుల సంఘం, కెవిపిఎస్ నాయకులు మహాసభ కరపత్రాలు విడుదల చేశారు. రమణ మాట్లాడుతూ డప్పు కళాకారుల ప్రధాన డిమాండ్లను ఏకరువు పెట్టారు. అనంతరం గ్రామ డప్పు కళాకారుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శిగా నరేంద్రతో పాటు 30 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయట మద్యం తాగితే చర్యలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

బహిరంగంగా మద్యం తాగినా, మద్యం తాగి వాహనం నడిపినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మునీర్ అహ్మద్ హెచ్చరించారు. మండలంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పట్టుబడితే కోర్టులో హాజరుపరుస్తామని, కోర్టు విధించే జరిమానాలు తప్పవని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జిలో నీరు.. గేదె మృతి

తుమ్మల వాసులకు తప్పని కష్టాలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని తుమ్మల గ్రామ సమీపంలో రైల్వే లెవెల్ క్రాసింగ్ 7 వద్ద నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిలో సుమారు 15 అడుగుల మేర నిలిచి ఉన్నాయి. దీంతో తుమ్మల గ్రామ ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రైల్వే బ్రిడ్జి పరిసర గ్రామాల్లో రైతులకు వందలాది ఎకరాల భూములు ఉన్నాయి. రైతులు పొలాలకు వెళ్లాలన్నా, గేదెలు, ఆవులు తదితర వాటిని మేత కోసం తీసుకెళ్లాలన్నా ఈ బ్రిడ్జి కింద నుంచే వెళ్లాల్సి ఉంటుంది. అయితే బ్రిడ్జి కింద పెద్దఎత్తున నీరు నిలిచి ఉండడంతో ఆయా పొలాల రైతులు, పాడి రైతులు నీటిలో రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆనీటిలో మునిగి పశువులు మృతిచెందిన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే శుక్రవారం మేతకు వెళ్లిన ఓ గేదె నీటిలో ఈదలేక మృత్యువాత పడింది. దీంతో దాదాపు రూ. లక్ష నష్టం వాటిల్లిందని

బ్రిడ్జి కింద నిలచిన నీటిలో మృతిచెందిన గేదె

బాధిత రైతు బాలిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. తమ ఇబ్బందులపై రైల్వే అధికారులకు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేదని తుమ్మల గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా రైల్వే అధికారులు స్పందించి లెవెల్ క్రాసింగ్ 7 బ్రిడ్జి కింద నీరు నిల్వ ఉండకుండా చిత్రావతి నది వరకూ కాలువ తీయాలని తుమ్మల గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఇంటి పన్ను సకాలంలో చెల్లించండి

ప్రజాశక్తి-నల్లచెరువు

ఇంటి పన్ను సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని కార్యదర్శి నరేష్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీలోని పలు గ్రామాల్లో ఇంటి పన్ను చెల్లింపుపై ప్రచార వాహనాల ద్వారా దండోరా వేయించారు. కార్యదర్శి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటి పన్ను వసూళ్లపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలు సహకరించి సకాలంలో ఇంటి పన్ను చెల్లించాలని కోరారు.



కదిరిలో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

పీడిత జన బాంధవుడు పూలే

వర్ధంతి సభల్లో ప్రముఖుల నివాళి

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మహాత్మజ్యోతిరావు పూలే వర్ధంతి సభలు నిర్వహించారు. ప్రజాప్రతి నిధులు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రముఖులు ముందుగా పూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే సమాజ హితం, అట్టడుగు, పీడిత, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం జీవితాంతం పోరాటం చేశారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ పూలే అడుగుజాడల్లో నడవాలని సూచించారు.

ప్రజాశక్తి-కదిరి అర్బన్

భారత సామాజిక తత్వవేత్త జ్యోతిబా పూలే కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, అణచివేతకు గురవు తున్న ప్రజల తరపున జీవితాంతం పోరాడారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కొనియాడారు. ముందుగా పట్టణంలోని పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పూలే 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలో జన్మించారన్నారు. 1890 నవంబర్ 28న మృతి చెందారన్నారు. ఆయన తండ్రి గోవిందరావు పీష్వాల కాలంలో పూల వ్యాపారం చేయడం వల్ల ఆయనకు పూలే అని పేరు వచ్చిందన్నారు. కులం, వర్గం, ప్రాంతం, లింగం, తదితర వివక్షలకు నిరక్షరాస్యతే కారణమని భావించి, తన భార్య సావిత్రిని చదివించారన్నారు. ఆ ఆదర్శ దంపతులు 1848లో బాలికల పాఠశాలను, 1851-52లో మరో రెండు పాఠశాలలను స్థాపించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఖాదర్‌బాదర్, నాగప్ప, డైమండ్ ఇర్ఫాన్, దాబా గంగయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు. జనసేన, బీఎస్పీ పార్టీతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే సేవలను కొనియాడారు.

పుట్టపర్తి రూరల్ : పట్టణంలోని ఐద్వా కార్యాలయంలో సిపిఎం నాయకులు అంకె ముత్యాలు, బ్యాల్ల అంజి ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికత అభివృద్ధి చెందని ఆ రోజుల్లోనే పూలే విద్య అనే జ్యోతిని పెట్టుకుని భవిష్యత్ తరాల కోసం కొత్తదారిని నిర్మించారన్నారు. ఆ తర్వాత అంబేద్కర్ అదే దారిలో నడిచారన్నారు. పూలే ఆశయాలను రాజ్యాంగబద్ధం చేసి తరతరాలుగా అణిచివేతలో ఉన్న ప్రజలకు అన్ని రకాల హక్కులను ప్రసాదించారన్నారు. కుటుంబం మారాలంటే స్త్రీ చదువుకోవాలని భావించిన పూలే మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించారన్నారు. భార్య సావిత్రిబాయికి చదువు నేర్పి ఆమెతో బాలికలకు చదువు చెప్పించారన్నారు. సావిత్రిబాయి దేశంలోనే ప్రప్రథమ మహిళా ఉపాధ్యాయినిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు, ఆఫీస్ కార్యదర్శి సిద్దూ, నబి, మున్నా, పాల్గొన్నారు.

కదిరిటౌన్ : పట్టణంలోని శివాలయం వీధిలో ఐద్వా నాయకురాలు శాంతిభాయ్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రమణమ్మ, హేమావతి, షాహినా, అక్కులమ్మ, అంజలి, అమరావతి, లక్ష్మీబాయ్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పెనుకొండ : సాంఘిక సంస్కరణలకు ఆద్యుడు మహాత్మ జ్యోతిబాపూలే అని బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ

పెనుకొండలో పూలేకు నివాళులర్పిస్తున్న బహుజన చైతన్య వేదిక నాయకులు

హిందూపురంలో పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

పేర్కొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో పూలే వర్ధంతి సభ నిర్వహించారు. దేశంలో కుల, మతాలకు అతీతంగా, సమాన హక్కుల కోసం పోరాడిన మహనీయులు అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవికుమార్, నరసిం హులు, రామాంజనేయులు, తిరుపతయ్య, కొళ్లప్ప, శివ, తులసి, రామాంజి, లక్ష్మణ్‌నాయక్, శశి, పవన్‌కుమార్, నరసింహులు పాల్గొన్నారు.

రొళ్ల : మండలంలోని టిడి.పల్లి ఎంపిపి పాఠశాలలో హెచ్ఎం కె.భూతన్న ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే ఆశయాలకు అనుగుణంగా సమ సమాజ స్థాపన కోసం మనమందరం నడుం బిగిద్దామని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హెచ్ఎం సూర్యప్రకాష్, రవీంద్ర, గవ్వల రామకృష్ణ, కరణం రఘునాథరావు, సరిత, చైతన్య, ముబీనా పాల్గొన్నారు.

హిందూపురం : మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం అందరూ ఐక్యంగా కృషి చేద్దామని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం బిఎస్పీ నియోజకవర్గం శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి రావు పూలే 135వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ శాఖ అధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బి.ఎస్.పి రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు, శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట వడ్డే నాగరాజు మాట్లాడుతూ పూలే దంపతులు అనేక సామాజిక ఉద్యమాలు చేసి నేటి సమాజానికి ఎంతో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్.ఎస్.ఎఫ్ రవి కుమార్, ఆర్.ఎస్పీ నాయకులు ఏ.శ్రీనివాసులు, బీఎస్పీ నాయకులు పెన్నయ్య, ఎస్ఆర్ పల్లి శ్రీనివాసులు, మౌలాలి, చిరంజీవి, నరసింహప్ప, స్టూడియో గంగాధర్ కొండప్ప, కిరణ్, రాముడు, గంగాధరప్ప, రామాంజనప్ప తదితరులు పాల్గొన్నారు.